**కథ**

# వివేకం

**"నీ ఉద్దేశ్యం ఎప్పటికి చెప్తావు స్వాతీ?"**
**వెనుదిరిగి చూసింది స్వాతి.**
**మురారి!**

'ఎందుకు ఇతను ఎప్పుడూ తన వెంటబడి తనను వేధిస్తూ ఉంటాడు. ప్రేమిస్తున్నానంటూ ఇప్పటికే ఐదారుసార్లు చెప్పాడు. ఈ కాలం ప్రేమపై తనకి నమ్మకం లేదు. ఎన్ని ప్రేమలు విఫలమైపోవట్లేదు. కేవలం సినిమాలలోనూ, కథలలోనూ మాత్రమే ప్రేమకథలు సఫలమవుతున్నాయి. నిజజీవితాలలో ప్రేమ కథలు చాలా వరకు విఫలమవుతున్నాయి. అందుకే తనకు ప్రేమపై అస్సలు నమ్మకం లేదు. ఈ మురారి ప్రేమ ఎంత గొప్పదో గానీ, దాదాపు ప్రతీరోజూ వెంటబడి వేధిస్తున్నాడు. తనకు మాత్రం ఇప్పటి వరకూ అతనిపై ఎటువంటి అభిప్రాయమూ లేదు' మనసులోనే అనుకుంది స్వాతి.

''మీపై నాకు ఎటువంటి అభిప్రాయమూ లేదు'' ప్రశాంతమైన వదనంతోనే బదులిచ్చింది స్వాతి.

''కానీ నేను నిన్ను ప్రేమిస్తున్నాను'' స్వాతి ముఖంలోకి సూటిగా చూస్తూ అన్నాడు మురారి.

''ఇప్పటికి ఆ మాట చాలాసార్లు చెప్పారు'' అదే ప్రశాంతతతో బదులిచ్చింది స్వాతి.

''మరి నీ అభిప్రాయం?'' మురారి.

''చెప్పానుగా మీపై నాకు ఎటువంటి అభిప్రాయమూ లేదు. ప్రేమపైన సదభిప్రాయం అసలే లేదు. ప్రేమలన్నీ విషాదాంతాలే. అవి కేవలం తాత్కాలిక ఆకర్షణలు, భ్రమలు మాత్రమే. మరి కొన్ని ప్రేమలు ఆత్మవంచనలు, ఆలోచన లేని పనులు మాత్రమే'' కచ్చితంగా చెప్పింది స్వాతి.

''కానీ నా ప్రేమ అటువంటిది కాదు స్వాతీ! నన్ను అర్థం చేసుకో నీ అభిప్రాయం తప్పు'' అనునయంగా అన్నాడు మురారి.

''ఐతే ఒక కండిషన్ మురారిగారు!'' అంది స్వాతి.

''ఏమిటి చెప్పు. నీ ప్రేమను పొందడానికి ఎన్ని కండిషన్స్‌కయినా సిద్ధమే'' స్వాతి చెప్పబోయే కండిషన్ కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నట్లుగా అన్నాడు మురారి.

''మీరెలానూ నన్ను ప్రేమిస్తున్నారు కాబట్టి, ప్రేమకు అర్థం, పరమార్థం పెళ్లి కాబట్టి, వెంటనే మనం పెళ్లి చేసుకుందాం. అప్పుడు ఎటువంటి అనర్థాలూ జరగవు. నా సందేహాలన్నిటికీ సమాధానమూ అదే'' అంది స్వాతి.

స్వాతి కండిషన్ మురారికి ఆనందమే కలిగించింది. ఒక రకంగా స్వాతి కండిషన్ మంచిదే అనిపించింది.

''సరే స్వాతీ! ఈ రోజే మా ఇంట్లో ఈ విషయం చెబుతాను'' అంటూ వెళ్లిపోయాడు.

★ ★ ★

''నాన్నగారూ! మీకో విషయం చెప్పాలి'' మనసులోని భావాన్ని బయటకు కనబడకుండా అన్నాడు మురారి.

''ఏమిటీ?'' అన్నారు సాంబశివరావుగారు కొడుకు చెప్పబోయే విషయం ఏమిటో అన్నట్లు సాలోచనగా చూస్తూ.

''నేనొక అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయి పేరు స్వాతి. మా ఆఫీసులోనే వర్క్ చేస్తోంది. మంచి అమ్మాయి'' తండ్రి ఏమంటాడోనని భయపడుతూనే చెప్పాడు మురారి.

''నీకసలు బుద్ధుందా? లేదా? నువ్వు అసలు మనిషివేనా? ఎవర్నో ప్రేమించడమేమిటి? నిన్నింత ప్రయోజకుడ్ని చేస్తే మాకు ఏ లాభమూ లేకుండా నీ దారి నువ్వు చూసుకుంటావా? నేనస్సలు ఒప్పుకోను. మరోసారి నా దగ్గర ఇటువంటి మాటలు చెప్పకు'' కస్సుమంటూ విసురుగా వెళ్లిపోయాడు సాంబశివరావుగారు.

షాక్ తిన్నాడు మురారి.

'ఇప్పుడు ఏమిటి చెయ్యడం? స్వాతికేమని సమాధానం చెప్పాలి? తల్లిదండ్రుల ఆశీస్సులు లేకుండా తనొక్కడే సాహసం చెయ్యగలడా? ఊహు..చాలా కష్టం. నాన్నగారు ఇలా అన్నారు కదా. అమ్మ దగ్గరైనా ప్రయత్నం చేయాలి' మనసులోనే సర్దిచెప్పుకున్నాడు మురారి.

★ ★ ★

**జి. మేరీకృపాబాయి**

''అమ్మా నీకొక ముఖ్యమైన విషయం చెప్పాలి'' ఎంతో నమ్రతగా అన్నాడు మురారి.

''ఏమిటిరా.. అంత ముఖ్యమైన విషయం?'' అర్థం కానట్లుగా చూస్తూ అంది అన్నపూర్ణ.

''నేనొక అమ్మాయిని ప్రేమించాను. పేరు స్వాతి. పెళ్లి కూడా చేసుకోవాలనుకుంటున్నాను. నీ అభిప్రాయం తెలుసుకుందామని...'' అంటూ ఆగిపోయాడు మురారి.

''ఈ ప్రేమ పెళ్లిళ్ల సంగతి నా దగ్గర చెప్పకు. అవెంత గొప్పవో మన పక్కవీధిలో వాళ్లని చూస్తే నీకు తెలీడం లేదా? రామారావుగారి అబ్బాయి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఏమయ్యింది? అప్పుడే విడాకుల వరకూ వచ్చేశారు. నాకు చెబితే చెప్పావు కానీ మీ నాన్నగారికి చెప్పకు. నీతో పాటు నన్ను కూడా తిడతారు'' అంటూ వంటింట్లోకి వెళ్లిపోయారు అన్నపూర్ణమ్మగారు.

మరోసారి షాక్ తిన్నాడు మురారి.

'ఈ సమస్య ఎలా పరిష్కరించుకోవాలి? తల్లిదండ్రుల అభిప్రాయాలు తన ఆలోచనలకి భిన్నంగా ఉన్నాయి. ఈ రోజు స్వాతితో ఏ సంగతీ చెబుతానన్నాడు. తను ఏం చెప్పాలి?' ఆలోచనలతో సతమతమైపోతున్నాడు మురారి.

★ ★ ★

ఆ రోజు ఆఫీసులో స్వాతిని చూసేసరికి ఎక్కడలేని నిస్సత్తువ ఆవహించింది మురారికి. తన మొహం ఎలా చూపించాలో అర్థం కాలేదు. ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో అర్థం కాలేదు. సాయంకాలం ఆఫీసు అయిపోయిన తర్వాత అందరూ వెళ్లిపోయారు. చివరగా స్వాతి కూడా హేండ్‌బ్యాగ్ తీసుకొని బయలుదేరింది. తనూ వెనకే వెళ్లాడు మురారి. కానీ స్వాతి వెదుదిరిగి చూడలేదు.

''స్వాతీ...'' పిలిచాడు మురారి.

ఏమిటన్నట్లుగా చూసింది స్వాతి.

''మన విషయం మా ఇంట్లో ఇంకా చెప్పలేదు. మరో రెండు రోజుల్లో ఏ విషయం చెబుతాను'' అభ్యర్థిస్తున్నట్లుగా అన్నాడు.

''సరే...'' అంటూ మరోమాట మాట్లాడకుండా వడివడిగా వెళ్లిపోయింది స్వాతి.

మరో రెండు రోజులు గడిచినా ఏ నిర్ణయమూ తీసుకోలేకపోయాడు మురారి. రెండురోజులు కాస్తా వారం రోజులయ్యాయి. వారం రోజులు కాస్తా నెల రోజులయ్యాయి. ప్రతీరోజూ తాను ఆఫీసులో స్వాతికి ముఖం చూపించలేకపోతున్నాడు. చాలాసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు మురారి.

★ ★ ★

''స్వాతీ! ఈ రోజు ఐదు గంటలకి ఒకసారి పార్క్‌కి రా! నీతో మాట్లాడాలి'' లంచ్ చేస్తున్న స్వాతితో అన్నాడు మురారి. అతని స్వరంలో కాస్త

వణుకు తెలుస్తూనే ఉంది.

ఆ రోజు ఐదు గంటలకల్లా పార్క్‌కెళ్లాడు మురారి. అప్పటికే అక్కడ కూర్చొని ఉంది స్వాతి. నెమ్మదిగా వెళ్లి మురారి కూడా ఎదురుగా కూర్చున్నాడు. ప్రశ్నార్థకంగా చూసింది స్వాతి.

''స్వాతీ మన పెళ్లి విషయం మా ఇంట్లో చెప్పాను. మా పేరెంట్స్ ఒప్పుకోలేదు'' చెప్పాడు మురారి.

''మరేం చేద్దామనుకుంటున్నారు?'' నిబ్బరంగానే అంది స్వాతి.

''ఇక నేను ఏ ప్రయత్నమూ చేయలేదు. తల్లిదండ్రులను ఎదిరించలేను. నీ దారి నువ్వు చూసుకో'' భయంగానే అన్నాడు మురారి.

చివ్వున లేచి నిలబడింది స్వాతి.



''ఈమాత్రానికేనా నా వెంటబడి అంతగా వేధించావు? ప్రేమిస్తున్నాను, ప్రేమిస్తున్నాను అని అన్నిసార్లు అరిగిపోయిన రికార్డులా చెప్పావు. ఆ పార్క్‌కి రా ఈ పార్క్‌కి రా అని అన్నిసార్లు వెంటబడ్డావు. ఆఫీసులో కూడా అందరికీ అనుమానం వచ్చేట్లు ప్రవర్తించావు. నిప్పులాంటి నా వ్యక్తిత్వానికి మచ్చను తెచ్చిపెట్టడానికి ప్రయత్నించావు. నేను ఏమాత్రం చలించకుండా నిబ్బరంగా ఉండబట్టి సరిపోయింది. నేను కూడా 'సై' అంటూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తే నా జీవితం ఏమై ఉండేది? ప్రేమించి మోసపోయినందున నాకు ఆత్మహత్య శరణ్యమై ఉండేది. సమాజంలో తప్పు చేసిన స్త్రీలా తలదించుకోవలసి వచ్చేది. కుటుంబ సభ్యుల మధ్య చులకనైపోయేదాన్ని. తెల్లకాగితం లాటి నా మనసు చిత్తుకాగితంలా తయారయ్యేది. మరొకరిని పెళ్లి చేసుకుంటే డబుల్‌గేమ్ ఆడాల్సి వచ్చేది. నా మనసులో ఎవరికీ చోటివ్వకుండా పవిత్రంగా ఉంచుకున్న అదృష్టవంతురాలిని నేను. పిరికిపందలా మాట దాటవేసిన దురదృష్టవంతుడివి నువ్వు. ఏ సాహసం చేయలేని వాడివి. నీకు ప్రేమించే హక్కు లేదు. ప్రేమించడం గొప్పకాదు. పెళ్లి చేసుకోవడమే గొప్ప. పెళ్లి దగ్గరకి వచ్చేసరికి నీ సామర్థ్యం బయటపడింది. అందుకే ఆ కండిషన్ పెట్టాను. నేను అనుకున్నట్లే నువ్వు ప్రవర్తించావు'' అంది స్వాతి.

''అది కాదు స్వాతీ...'' ఏదో చెప్పబోయాడు మురారి.

''షటప్! ఇక నీకు మాట్లాడే చాన్స్ ఇవ్వను. ఇకమీదట ఇటువంటి వెర్రి వేషాలు వేయకు...'' అంటూ చకచకా నడుచుకుంటూ వెళ్లిపోయింది స్వాతి.

❀